# పున్నమి మసకలు

"....సామ గాన ప్రియ స్సర్వ రక్షక
స్సాగ రోద్భవ :
భయాన్తకృ ద్భక్తి గమ్యో
భవ బంధ విమోచక:
జగ త్ప్రకాశ కిరణో
జగ దానంద కారణః ....'' (చంద్ర. స్తో)

ఆరాత్రి నిండు పౌర్ణిమ, చుట్టూ కారు చీకటి. ఉరుములూ మెరుపులతో కుంభవృష్టి, పల్లెటూరేమో, పెందలాడే భోజనాలయినయి. పళ్ళెంలో ఆకులూ వక్కలూ ఉన్నాయి. తాంబూలాలు వేసుకుంటున్నాం. జనార్దనయ్యగారు ఆ సావిట్లోనే, చుట్ట కాలుస్తూ పడక కుర్చీలో కూచున్నారు.

"పున్నమి గడియలు దాటేవరకూ ఈమసక ఆగదమ్మా. ఆ వెనకనే బండి కట్టిస్తా. నేను కూడా వచ్చి రైలువద్ద దిగబెడతా. అంతవరకూ సంతోషంగా ఇక్కడే ఉండండి. మీ బస్తీ కబుర్లా, కాలేజీ కబుర్లా చెబుతూండండి, వేం వింటూంటాం," అన్నారు జనార్దనయ్యగారు - రెండు నాళ్ళకిముందే.

శారదాంబగారు కూడా చాలా సంస్కారం గల మనిషని పేరు-వాళ్ళ పుట్టింట్లో; అంటే, మా ఉళ్ళో. మాకు ఆ వృద్ధ దంపతులతో పల్లెటూరులో కాలం గడపడం ఏమీ కష్టంగా లేదు. పైగా, ప్రతి నిముషమూ అనుభవంతోనూ, ఆనందంతోనూ గడిచేది. ఆవిడా భోజనం చేసుకుని మాతో వచ్చి కలిశారు. అందరమూ ప్రశాంతంగా కూచుని పిచ్చా పాటీ చెప్పుకుంటున్నాం. కాస్సేపటికి మా మాట లాగినయి.

గది దీపం వెలుగులో, గుమ్మంలో తెర కట్టినట్టూ వర్షధారలు, కొంచెం మేర ఒక వరస కనబడుతున్నాయి - పైనించీ క్రిందికి జారుతూ, భూమిమీదకి. మాకు ఎదురుగా దేవుడి గదిలో దీపం కనిపిస్తూంది. గాలికి అటూ ఇటూ ఒరిగి కూడా పైకి చూస్తూ నిలబడి వెలుగుతూంది - అగ్ని నాలుకలా. ఎదుగుతూన్న పచ్చని మువ్వాకులూ, ఎగరబోతున్న పక్షులూ, వికసించిన పువ్వులూ, అన్నీ పైకే చూస్తాయి- పైకి-సూర్యుడికేసి, ఆకాశంవేపు, భగవంతుని వైపేమో అనిపించింది.

బయట వర్షం తగ్గింది. ఉన్నట్టుండి, కళ్లు చెదిరేటట్టు ఒక్క మెరుపు మెరిసింది ఆకాశంమీద. మాకెదురుగా బయట, గుమ్మంలో నించి కనబడే కలువగుంట తెరిపిలో, అప్పుడే మబ్బులోంచి విడిన చంద్రుడు ప్రతిబింబిస్తున్నాడు. గుంట గుట్టమీద, గుంటకి అటు ప్రక్క ఇంటికీ గుంటకీ మధ్య, ఒక నడివయస్సు స్త్రీ మూర్తి, పైకి, ఆకాశం వైపు తలెత్తి, చంద్రుడికి దణ్ణం పెడుతూ నిలుచుని ఉంది. ఈ అపూర్వ దృశ్యం ఆ మెరుపు వెలుగులో ఒక క్షణకాలం మాకళ్లబడింది. వెన్నెలా, మెరుపూ కలసిన వెలుగులో ఆ వ్యక్తి ఏదో ఇహలోకానికి సంబంధలేని మృతజీవిలాగు అనిపించింది మాకు.

ఫెళఫెళ మన్న ఉరుములు ఆగినతరువాత తిరిగి కారు చీకటి క్రమ్మింది ప్రపంచంనిండా. పుటపుట మన్న చినుకులతో వర్షం హెచ్చింది.

శారదాంబగారి ముఖం, దీపపు వెలుగులో బాధగా కనిపించింది.

మా అవ్యక్త ప్రశ్నకీ, ఆశ్చర్యానికీ జవాబుగా "అది గంగారత్నం. ఇరవై అయిదు ఏండ్లయిందమ్మా! అది పక్కున నవ్విగాని, భోరున ఏడ్చిగాని. ముక్తసరిగా జవాబు లిస్తుంది-అదైనా ఇష్టమైతే. తన ప్రపంచం తనది. వర్షమైనా, వరదైనా ఇల్లా పున్నమి చంద్రుడికి ఏమి ప్రార్థనో చేసి దణ్ణం పెడుతుంది," అన్నారు శారదాంబ గారు.

జనార్దనయ్యగారు చుట్ట గుప్ గుప్ మని మరీ ఎక్కువగా పీల్చారు.

బయట వర్షం బాగా హెచ్చింది. శారదాంబగారు మాతో చెప్ప నారంభించారు.

* * * *

సోమరాజుగారు చాలా మోతుబరి ఆసామీ ఈఊళ్లో. ఆజానుబాహువు, స్ఫుర ద్రూపి. కఠినంగా మాట్లాడడం తెలియనైనా తెలియదాయనకు. దయా దాక్షిణ్యాలు,

దానధర్మాలు ఎక్కువ. మీ జనార్దన తాతయ్యగారూ ఆయనా చిన్నప్పుడు ఒక వీథి బడిలోనే చదువుకున్నారట. ప్రాణస్నేహితులు ఇద్దరూ.

తొలి భార్యకు నలుగురు కొడుకులు-అతి దుర్మార్గులమ్మా. తులసమ్మ కడుపున దూలగుండ పుట్టినట్టు పుట్టుకొచ్చారు.

రెండవ కళత్రం చూలాలు. అప్పుడు కట్టారు ఆ కనబడుతున్న ఇల్లు - కలువగుంట కవతలిది. అసలు సోమరాజుగారిది ఈ వీధి మొదట వున్న పెద్ద లోగిలి. ఈ స్థలం ఆయనది. అందుకని వంటకట్టెలూ వగైరా పెట్టుకోడాని కనే అభిప్రాయంతో ఈ చిన్న ఇల్లు కట్టారు. దానికి పునాదులు తీసేటప్పుడు బయట పడ్డది ఆ విగ్రహం. బాగా నిలువుటెత్తుది - రాతి విగ్రహం. అది ఏనాడో గ్రామదేవత గంగమ్మ అని అందరూ నిశ్చయించారు. ఆ దేవికి గుడికట్టి ప్రతిష్ఠ చేస్తానని సోమరాజుగారు, అందిరితోనూ మనస్ఫూర్తిగా అన్నారు. తాత్కాలికంగా అదిగో మనకు ఫర్లాంగు దూరంలో వున్న 'నడిదిబ్బ' మీద చింతచెట్టు ప్రక్కన కొంచెం దూరాన కాస్త పల్లం వుంటే, అక్కడ నిలబెట్టి, చుట్టూ రాళ్ళూ, మన్నూ అండచేర్చారు.

ఇల్లు కట్టడం పూర్తికాగానే చుట్టూ గుడి కట్టిస్తానన్నారు. కాని, ఇల్లు పూర్తి అయింది. ఆయన భార్య ఆడపిల్లని ప్రసవించి అరటిచెట్టైల్లే కూలిపోయింది. పిల్లకి గంగమ్మతల్లి పేరే పెట్టారు. కాని, భార్య పోయినదగ్గరనించీ మనిషి అదోలాగు అయిపోయారు;- క్రుంగిపోయారు. బ్రతుకుమీదే ఆసక్తి తగ్గిపోయినట్టయింది. తను ఆ ఒక్క పసికూన కోసమే బ్రతికివున్నారా అనిపించేదమ్మా. దేవి విగ్రహానికి గుడి కట్టడానికీ ఉత్సాహం లేదు. ఆ పని నాటికీ, నాటికీ యాపన అవుతూనే వచ్చింది. అందరూ ప్రోత్సహించినా, ఆయన, అదిగో ఇదిగో కట్టిద్దామనేవారేగాని, శ్రద్ధగా కట్టడానికి పూనుకోలేదు. ఆయన మనస్సు నెమ్మదీ లేదు. గంగమ్మ తల్లి ఎండల్లో వెలిసి, వానల్లో తడుస్తూనే వుండేది.

ఇహను, సోమరాజుగారు ఈ పసిదానికి తల్లీదండ్రీ తానై, వెయ్యి కళ్ళతో కాపాడుతూవచ్చారు. తండ్రి అంత ఆజానుబాహువా, అయినా ఆయన అంతపెద్ద చేతులూ ఎంతో నాగరికంగానూ, సుకుమారంగానూ, సున్నితంగానూ వంగేవి - ఆ బిడ్డని సంరక్షించేటప్పుడు.

ఈ గంగ అన్నారూ, ఇది ఒక విచిత్రమైన పిల్ల. 'చందమామ రావే జాబిల్లి రావే!' అని ఎదిగినతర్వాతకూడా, చిన్నప్పుడు వాళ్ళ నాన్న నేర్పిన పదం పాడుతూ, ఎప్పుడూ చంద్రుడి కేసి చూస్తూనే వుండేది. దానికి పువ్వులన్నా మహా ఇష్టం. నన్నడిగి, మన దొడ్లో మల్లెలన్నీ కోసుకుపోయినా దానికి ఆశ తీరేదిగాదు. అయినా, ఆఖరుకి ఒక్క పువ్వుమాత్రం చెట్టుకి వుంచేది, చాదస్తంగా. "పిన్నిగారూ, ఈ పువ్వు చందమామకి," అంటూ, తండ్రి చెయ్యి పట్టుకునే తిరిగేది ఎప్పుడూ. దాన్ని వదలి ఆ తండ్రి ఒక్క ఘడియ వుండరు.

సరి, తండ్రి కూతుళ్ళ మధ్య ఈ అనురాగం, అన్నలకు ఈర్ష్య ఎక్కువచేసింది. తండ్రి కాస్తదూరంగా వున్నప్పుడూ, ఎవ్వరూ దగ్గరలేనప్పుడూ, గంగని ఇంట్లో చిత్రహింస పెడుతూండేవారు.

"ఒరే, తల్లిలేనిదాన్ని ఎందుకురా అల్లా అన్నారుట?" అని ఒకవేళ ఆయన అడిగితే, "మీరు మరీనూ, మాకుందా ఏం తల్లి?" అనేవారు కొడుకులు.

ఇలా రోజులు గడుస్తున్నాయి. ఒక చీకటి రాత్రి, భోజనాల వేళకి ఒక పెద్ద పొలి కేక వినిపించింది-ఉన్నట్టుండి, హఠాత్తుగా అసలే దయార్ద్రహృదయుడేమో, సోమరాజు గారు, కొడుకులతో "ఒరే ఎవ్వరో పరదేశి దారితప్పినట్టున్నాడు. మన నడిదిబ్బ ప్రక్కనించే వినిపిస్తోంది కేక. వెంటనే వెళ్ళండ్రా!' అన్నారు. "భోజనాలకి కూచుంటున్నాం. ఆఖరుకి కన్న కొడుకులకంటె పరదేశి ఎక్కువయ్యాడు మీకు!" అని గొణుక్కున్నారు.

ఆఖరుకి పొలేళ్లు వెళ్ళారు. హరికేను లాంతర్లూ బాణాకర్రలూ పుచ్చుకుని. ఆ నడిదిబ్బమీదనించి పెద్ద గట్టు ఒకటి, కాలవ ఒడ్డు రహదారీ రోడ్డుకుకూడా చేరుతుంది. అందువల్ల ఆ దిబ్బను అప్పుడప్పుడు అడ్డత్రోవగాకూడా ఉపయోగిస్తారు. అన్నట్టూ, మీరు బస్తీపిల్లలుగా, ఇల్లా చీకట్లో దారి తప్పినా, దొంగలచేత చిక్కినా మా పల్లెసీమల్లో అల్లాగే అరుస్తారు. దగ్గర వున్న గ్రామాలవాళ్ళు ఎదురు అరుచుకుంటూ వెళ్ళి బాటసారిని రక్షిస్తారు. అది ఆనువాయితి – ఇప్పుడంటే కొన్ని గ్రామాల్లోనైనా వీధి లాంతర్లు పడ్డాయిగాని.

అతను ఒక బీద యువకుడు. కాస్త దూరపు పల్లెటూరు. ఒక వెధవతల్లి తప్ప, నా అనేవారు లేరు. పొలాలు పండక, అప్పులు తీర్చలేక గడవడం కష్టమై, ఇటుప్రక్క

బస్తీలో పంచదార ఫేక్టరీ ఒకటి పెట్టారంటే, అందులో గుమాస్తా గిరి వెతుక్కోడానికి వెళుతూ, ఎరుగని ఈ ప్రాంతంలో దారితప్పాడుట. కారు చీకటిలో గ్రామం దీపాలు కనిపించి, అడ్డత్రోవనిబడి దిబ్బమీదుగా వస్తూ, చీకటిలో కనబడక, గంగమ్మ తల్లికి చుట్టూ నిలబెట్టేడానికి పెట్టిన చిన్న రాళ్ళు కాళ్లకి తగిలి, దేవిమీదనే పడిపోయాడట. కాళ్ళకి గాయాలు తగిలినయి. కాస్త తెప్పరిల్లి కేకపెట్టాడట.

విషయమంతా విని, సోమరాజుగారు భోజనం పెట్టించి, వసతి ఇచ్చి, మరునాడు తనవద్దనే గుమాస్తాగా ఉందువులెమ్మన్నారట.

కొన్నాళ్ళకి ఆ బాటసారి నాగభూషణం, సోమరాజుగారికి నమ్మిన బంటయాడు. యజమానీ క్రమేణ అతనిమీదనే నిర్వహణ అంతా వదిలివేశారు. ఆ విషయం తన కొడుకులకు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

కొన్నాళ్ళకు కొడుకులకు వరుసగా పెళ్ళిళ్ళయినయి. పెద్ద కోడలు మహా గయ్యాళి. భర్తకు తగినదే. పుట్టింటివాళ్ళు కలిగిన వాళ్ళు గారు. ఇక్కడ భర్తకు నేర్పిపెట్టింది. ఆ ప్రోద్బలంమీద, ఒకనాడు "మా ఆస్తులు మాకు పంచి ఇవ్వండి," అన్నాడు పెద్దవాడు, తండ్రిని, ఎదటపడి.

తండ్రికి ఊరంతా జోహారు లిస్తారాయె! అందుకని ఈమాట గొట్టె కరవవచ్చి నట్టనిపించిం దాయనకు. "ఇప్పుడేం తొందరరా! చంటిదానికికూడా నాలుగు అక్షతలు పడనియ్యి." అన్నారు ముక్తసరిగా, రుసరుసలాడుతూ పెద్దవాడు తన గదిలోకి వెళ్ళి పోయాడు. ఆరోజున జనార్దన తాతగారు అక్కడే వున్నారట. భార్య అందించగా మళ్ళా వచ్చి, "అయితే, ఈ ఆస్తిలో దమ్మిడీ గంగ కివ్వడానికి వీలులేదు. ఇది పిత్రార్జితం. అది తీసికెళ్ళి ఏ పరాయివాడి కొంపో నిలబెట్టడానికి మే మెవ్వరమూ ఒప్పుకోము," అన్నాడు ఖచ్చితంగా. దానికి, తండ్రి. "నా స్వార్జితం వేరే బంగారు చెక్క వుందిరా. దాని తల్లి జవ్వారీ దానికి బాలతొడుగు. మీ దయా దాక్షిణ్యాలు దాని కేమీ అక్కర్లేదురా," అన్నారు. పళ్లు లోలోపలే కొరుక్కుంటూ. తన గదిలోకి వెళ్ళిపోయాడు పెద్దకొడుకు.

ఇహను, పెద్దకోడలు ఆలోచించడం మొదలెట్టింది. తనకి ఒక్కడే ఒక్క తమ్ముడు హనుమంతు. చదువూ సంధ్యలూ లేవు. రూపురేఖలూ లేవు సరిగదా, కలిమి అసలే లేదు. పైగా, వేపకాయంత వెర్రి అని కూడా చుట్టూ గ్రామాల్లో ప్రఖ్యాతి. నలుగు రాడ వాళ్ళు ఎక్కడైనా గుమిగూడితే సర్వమూ మరిచిపోయి, అక్కడే ఇకిలిస్తూ

నుంచుంటాడు. వరసలైనవాళ్ళు ఆడపిల్లల్ని అంత దూరాన్న చూపించి. "ఆ అమ్మాయి సంబంధం మాట్లాడుతాంరా నీకు." అంటే చాలు. వాళ్ళకోసం ఎంత కాయకష్టమైనా చేస్తాడు, ఆ హనుమంతుకి ఎలాగా, ఎవ్వరూ పిల్లనివ్వరు. ఈతల్లి లేని గంగని మతి విరిచేసి, వాడి కిచ్చి పెళ్ళిచేస్తే సొత్తూ సంబంధమూ అన్నీ వస్తాయి. తన పుట్టిల్లూ నిలబడుతుంది. గంగ కిచ్చే ఆస్తి తన తమ్ముడికే వస్తుంది.

హనుమంతుని ఇంటికి రప్పించింది. అతన్నిగురించి గంగ దగ్గర పొగడడం మొదలెట్టింది. ఇంతవరకూ తండ్రిప్రక్కన కంచం పెట్టమంటే,"ఏం, మగరాయు డివా? ఆడవాళ్ళతో భోంచెయ్యి,'' అని కసిరే వదిన తండ్రిగారికి, గంగకి, ప్రక్కన హనుమంతుకీ సహపంక్తిని వడ్డించడం ఆరంభించింది. సోమరాజు గారిది రాజచూపు. ఈ వన్నాగా లేవీ పారలే దాయనదగ్గిర.

గంగ ఎదిగి, బంగారుబొమ్మలా అయింది. నిజంగా శివుడి శిఖలో వుండ వలసిందే ననిపించేది. వంటినిండా బంగారు తొడుగు – తన తల్లిది. వన్నెకొక్క చీర నేయించాడు తండ్రి.

అమ్మవారికి తను మొదటినించీ అనుకున్నట్టే గుడి కట్టించి, వెంటనే గంగకు పెళ్ళి ఏర్పాట్లు చేద్దామని నిశ్చయించారు సోమరాజు గారు. మీ జనార్దనతాతగారితో సంప్రదించే.

గంగ మనస్సులో ఏమేమి భావాలుండేవో ఎవ్వరికీ తెలియవు. భూషణం బుద్ధిశాలీ, గుణవంతుడూ అనే తెలుసు. వయస్సులో ఉన్న అతని మనస్సూ మనం ఎరుగము. కాని, ఇంతలో ఒక సంఘటన జరిగింది.

ఈ ఎదురుగుండా ఉన్న–కలువగుంట కవతల – ఇంట్లో. వంటచెరుకూ, వ్యవసాయపు సామాన్లూపెట్టి ఉంచేవారు – ఆఇల్లు కట్టినప్పటినించీ, అంటే గంగ పుట్టినప్పటినించీ. ఒక ప్రదోషవేళ తండ్రీ కూతురూ ఈ ఇంటికి వచ్చారు. కావలసిన సామానులు తీసి నౌకర్ల చేతికిచ్చి పంపి, వెనక ఇల్లు సరిదిద్ది, తాళాలు వేసుకుంటు న్నారు సోమరాజుగారు. ఈ లోపుగా గంగ బయటికి వచ్చింది. అంటే ఈకలువ గుంట గట్టుమీదికే నన్న మాట. ఆగుట్టప్రక్కన కలువలు దట్టంగానే ఉండేవి. ఇటు ప్రక్క నీళ్లు తెరిపిగా ఉండేవి. పైగా అప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. గాలి లేదు, చుట్టు ఎవ్వరూ లేరు. గంగ, ఎదురుంగా ఉదయిస్తున్న చంద్రుణ్ణి చూస్తూ

నిలబడి పోయింది గట్టుమీద-తనను తానే మరచిపోయి. ఎలా ఉందనుకున్నారు అప్పుడది? చూడడానికి రెండు కళ్లు చాలవు. అల్లా తన్మయత్వంలో మైమరచి ఉన్న ఆ అపూర్వ ప్రతిమను మీ తాతగారు, నేనూ ఇక్కణ్ణించే అల్లాగే చూస్తూ ఉండిపోయాం. కాని, మా కళ్ళుకాస్త ఇటు మళ్లేటప్పటికి, ఈ మామిడిచెట్టు మరుగునుంచి, ఈ తెరిపి నీళ్ళల్లోకి చూస్తూ, భూషణం. కదలకుండా నిలబడి ఉన్నాడు. ఆ తెరిపి నీళ్ళల్లో ప్రతిబింబిస్తున్న చంద్రుణ్ణీ, పైకి తల ఎత్తి చూస్తున్న గంగ నల్లటి ప్రతిబింబాన్నీ, రహస్యంగా తదేక దృష్టితో చూస్తూ నిలబడి పోయాడు. అతను ఎటునించీ వచ్చిందీ మాకు తెలియలేదు. అంతలోనే సోమరాజుగారు కేక పెట్టారు. గంగ తిరిగి, ఎవ్వరినీ చూడకుండానే, తండ్రితో కలసి పెద్ద ఇంటికి వెళ్ళిపోయింది. భూషణం మమ్మల్ని చూడనేలేదు.

హనుమంతు వెర్రిచేష్టలు ఎక్కువయ్యేసరికి, ఉండబట్టలేక ఇంట్లో కర్రపెత్తనం చేస్తున్న సోమరాజుగారి పెద్దక్కగారు విషయమంతా ఆయనతో చెప్పేసింది - హనుమంతునీ, వాళ్ళక్కనీగురించి. సోమరాజుగారు ఉగ్రరూపం దాల్చారు. ఆనాడు అందరి భోజనాలూ అవంగానే, అందరూ వినేటట్టూ అన్నారు. "ఇదిగో, ఎవ్వరూ పిచ్చి ఊహలేవీ పెట్టుకోనక్కర్లేదు, వెర్రి వెంగళప్పల కందరికీ ఇచ్చి ముడెట్టడానికి నా కూతురేం నాకు బరువా? లేక కాలువంకా? చెయ్యి వంకా? ఇల్లాంటి సంబంధం చేయవలసివస్తే, ముందు దాన్ని నూతిలో త్రోసి చంపి, నేను చస్తాను. అల్లాంటిపెళ్లి బ్రహ్మకల-అల్లాంటి ఆలోచనలన్నీ మానడం మంచిది." అని గర్జించారు. పెద్దకోడలు కారాలూ, మిరియాలూ నూరింది. తన ఆశలన్నీ, ఏర్పాట్లన్నీ నిష్ఫలమైనాయి.

ఆవిడ, విషతుల్యంగా రెండో పన్నాగం పన్నింది. గంగ మీద అసూయ ఎక్కువైంది. దాని మీద లేనిపోని నిందలువేసి మాట్లాడడం మొదలెట్టింది.

అమ్మాయికి సర్పదోషం ఉందని అమ్మలక్క లందరితో రహస్యంగా చాటించింది. "అందుకనే సొత్తులో సొత్తుగా ఉంటుందని, మావాడికే కట్టేద్దామా అని కూడా అనుకున్నా. ఏం లాభం? ఆ చక్కని చుక్కకి మావాడు పనికిరాలేదుట. ఏ తలచెడ్డవాడూ కట్టుకోడు గదా! ఎవ్వరి ప్రాణం వాళ్ళకి తీపిగదుటమ్మా?'' అంటూ, పనిమాలి వచ్చిన అమ్మలక్క లందరితోనూ విసుగులేకుండా చెబుతూ వచ్చింది. ఆమాట ఊరంతా పాక్కిపోయింది, సోమరాజుగారికి ఇంకా ఆ విషయం తెలియలేదు.

ఈలోపుగా గంగ తెలివితక్కువపని ఒకటిచేసి మాకు దొరికిపోయింది. గంగ చిన్నతనంలో చేసిన విచిత్రమైన పనులలో ఒకటేమిటంంటే, లేగదూడల మూతులకి వేసిన చిక్కాలు కాస్తా విప్పి వేయడం. ఆచిక్కాలు గంగ చూడలేకపోయేదట. నోరు కట్టేస్తే ఎల్లా? అయ్యో పాపం! అనిపించేదట. అందుకని విప్పేసేది. ఆ దూడలు మరీ ఎక్కువపాలు త్రాగెయ్యడము, మన్నుతినడమూ జరిగేది. ఆ పసివాటికి కడుపు నొప్పి వస్తూండేది. అయినా విప్పేయడం మానలేదు. దీని ఏడుపు ముఖం చూసి, వాళ్ళ నాన్నగారు కూడా ఏడ్చినంతపని చేసేవారుట. ఆ కారణంగా జున్నుపాలు ముట్టేది గాదు, జున్ను కన్నెత్తి అయినా చూడదు. ఆ పసిదూడల నోళ్ళదగ్గర నించీ ఆ పాలు మనం తియ్యడం పాపమని దానికి ఒక నిశ్చితాభిప్రాయం, ఆ చిన్నతనంలో. అల్లా అల్లా జున్నంటే అసహ్యం ఏర్పడ్డది గంగకు. సోమరాజుగారు మాత్రం అందరితో పాటే, ఇష్టమూ లేదు, అనిష్టమూ లేదు.

అల్లాంటప్పుడు మన ఎర్రగేద ఈనితే "పిన్నిగారూ జున్ను వండరూ? వండి పెట్టరూ? వండండీ!" అని గంగ ప్రాణం తోడేసింది. నేను వండి రెండు ఆకుల్లోనూ పెట్టి కబురుపెట్టా, తండ్రీ కూతుళ్ళని రమ్మని. సోమరాజుగారూ, భూషణమూ వచ్చారు. "గంగ ఏదీ?" అన్నాను. "దానికి జున్నుపాలు గిట్టదుగా, భూషణానికి జున్ను చాలా ఇష్టమని అన్నాడట. అందువల్ల అతన్ని కూడా తీసికెళ్ళమంది నన్ను!" అన్నారు సోమరాజుగారు. పాపం భూషణం కూడా అరమరేమీ లేకుండానే అడిగ్గి మరీ వేయించుకుని తృప్తిగా తిన్నాడమ్మా. ఇంతకీ, దానితో మాకు కాస్తా తెలిసి పోయింది, వ్యవహారం.

ఇలా ఉంటూంటే, ఓనాడు హనుమంతు ఒక అట్టమీద ఒక కప్పపిల్లని తెచ్చి గంగమీదికి విసిరి వేశాడుట. అది అసలే భయస్థురాలేమో, కెవ్వుమని కేక పెట్టిందట. ఇది సోమరాజుగారి వెధవక్క గారు చూసి "ఏమిటబ్బాయి. ఆ మోటుసరసం? పిల్ల జడవదూ?" అని గద్దించింది. అంతలోనే హనుమంతు అక్కగారు "ఆc! ఆ మాత్రానికే అంత అదిరి పాటెందుకమ్మా? వాడు వెయ్యాలని ఏమీ వెయ్యలేదు, ఇంతోటి సుందరి మీదాను. ఆ కప్పని. ఎంత అబ్బరం అమ్మా, ఈపిల్లది! ఎవ్వరో కొట్టినట్టూ అరుస్తుందేం? ఇంట్లోకి కప్ప వచ్చింది అని, వాడుదాన్ని అట్టమీదికి ఎక్కించి పారవెయ్యడానికి వెళుతున్నాడు. వెళుతూంటే ఆ కప్ప కాస్తా చటుక్కున గెంతింది. ప్రక్కన ఉన్న ఆ అమ్మాయిమీద పడ్డదెల్లే ఉంది. దానికి, ఏదో

కావాలన్నట్టూ.....” అని ఏకరవు పెట్టింది. చేసేదేమీ లేక గంగ ఏడుపుముఖం పెట్టింది.

ఇహను, అక్కణ్ణించీ ఒక్క సంబంధంవస్తే ఒట్టూ. అమ్మాయికి దోషం ఉందనీ ఏవేవో వదంతులు. ఊరు ఉడికి పోయింది. ఒక్క సంబంధమూ రావడంలేదు, దానితో సోమరాజుగారికి మనోవేదన ఎక్కువవుతూ వచ్చింది.

ఇప్పుడిక ఆయన్ని బహిరంగంగానే ధిక్కరిస్తున్నారు కొడుకులూ, కోడళ్ళూ. జీవితమంతా మర్యాదకి అలవాటుపడ్డవాడేమో, ఆయన మనస్సు మహా బాధపడు తూండేది. గంగని ఇంట్లో రంపపు కోత పెట్టేవారు అన్నలూ, వదినలూ కూడా. ఆయన ఒక్క నిమిషం పొలంలోకి గాని వెళ్తే, చాలు, దానిని ఏదో ఒకటి అనడమో, గేలీ చెయ్యడమో ఏదో జరిగేది. సోమరాజుగారికి కుమార్తె వివాహం ఒక సమస్య అయిపోయింది. ఆయన మనస్సు క్రుంగిపోయింది. అది ఆఖరుకి ఒక తీరని బెంగ అయిపోయింది. రాత్రీ, పగలూ ఆ పిల్లదే ధ్యాస అయిపోయింది. మరేదీ ఆలోచించడం మానేసారు. ఒక్కొక్కసారి గంగ తల నిమురుతూ కన్నీళ్లు జార్చేసేవారు. అది చూసి తండ్రిని కౌగలించుకుని అదీ ఏడ్చేసేది.

ఆఖరుకి, మీ జనార్దన తాతగారి సలహా మీదనే, పిల్లపేర 'ఉయిలునామా' వ్రాసేశారు. రహస్యంగా–పిల్లకి మైనారిటీ తీరిన తరువాత ఆ పది ఎకరాల పొలమూ, ఆరువేల రూపాయల జవ్వారీ, ఈ చిన్న ఇల్లూ దానికి చెందేటట్టూ, సంతకం మీ తాతగారే పెట్టారు. అది రెండో కంటివాడికి తెలియకుండా భద్రంగా ఇనపపెట్టెలో పెట్టి దాచారు, సోమరాజుగారు.

మన సలహా మీదనే గంగని భూషణానికిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించారు. భూషణం తల్లి దూరపు దాయాదులతో తరలి వచ్చింది. వివాహానికి పెట్టిన బంగారు తొడుగు మళ్ళా తీసి భద్రంగా దాచేశారు సోమరాజుగారు. పిల్ల వంటిమీదనించి కూడా బలత్కారంగా లాగేసుకుంటారేమో ననిపించింది ఆయనకీ, మాకూ కూడాను.

గంగనీ, అల్లుణ్ణీ ఆ ఇంట్లో ఉంచడానికి వీల్లే దన్నారు కొడుకులు.“నిన్నటి వరకూ మాకు జీతగాడివా! ఈవేళ మాఇంటికి అల్లుడివా!'' అంటూ, అమర్యాదగా, హీనంగా చూడడం మొదలు పెట్టారు. అక్కడ ఉండడం దుర్భరం అయిపోయింది.

అప్పుడు, ఈ ఎదురుగుండా ఉన్న ఇంట్లో సామాన్లు ఖాళీ చేయించి, అక్కడ కాపరం పెట్టించారాయన. గంగకి అత్తగారు పెద్ద దిక్కు. సాదరు సామానులన్నీ తన ఇంట్లోనించీ పంపిస్తూ వచ్చారాయన. అదీ అన్నలకి ఇష్టంలేకపోయింది. సామాను వస్తూంటే అటకాయించడం మొదలుపెట్టారు. అసలు ఈ ఇంట్లో నించీ కూడా వెళ్ళగొడుదురుట, – మా కంత జడిసి, అంటే పాపానికి వెరచికాదు, లోకానికి. క్రమంగా ఆ యేడు పొలంలోనూ, ఇంట్లోనూ కూడా అధికారం తీసేసుకున్నారు, ఆయనదగ్గరనించి, ప్రతి విషయంలో తండ్రిని ఎదిరించడం ఎక్కువ చేశారు. ఆయనకు దుఃఖం పొంగుకు వచ్చేది. ఎన్నిసార్లో కళ్ళల్లో నీళ్ళు వచ్చేవి. "చంటి దానికి, కాస్తా అక్షతలు పడ్డాయి, అన్నగారూ, ఇకను నేను ఏదో నుయ్యో గొయ్యో చూచుకోడం ఉత్తమ మనుకుంటాను! దాని మైనారిటీ తీరి, దాని సొత్తు దానికి హక్కు అయ్యేవరకూ నేనిల్లా జీవచ్ఛవంలా బ్రతకాల్సిందే!'' అని ఇక్కడ మాఇంట్లో అంగలార్చేవారు.

కొడుకులు భూషణాన్ని గుమాస్తాగిరిలోంచి తీసేశారు. ఇంటికి రావద్దన్నారు. ధాన్యం వాళ్ళే, గరిసెలు కట్టించారు. సర్వాధికారాలూ చేతపట్టుకున్నారు. క్రితం సంవత్సరం బాపతు ధాన్యం పన్నెండు పుట్లు నిలవచేసిన గాది తాళాలూ, ఇనప పెట్టి తాళాలూ గుత్తిగా సోమరాజుగారి వద్దే ఉండేవి. అవి మాత్రం, అప్పటికి, ఆయన వద్దనించి పుడిగి పుచ్చుకోలేక పోయారు. ఎందుకైనా మంచిదని ఆ తాళాల గుత్తి మీ తాతగారి వద్దనే ఒప్పజెప్పేశారు, రహస్యంగా ఆయన. భూషణం, తను సంవత్సరాలక్రితం అనుకున్నట్టూ, చెక్కర ఫ్యాక్టరీకి వెళ్ళి చేతికందిన పని చేసి వస్తున్నాడు. రెండు రోజులు పని ఉంటే రెండు రోజులు పని ఉండేదికాదు.

గంగకు కుటుంబం గడవడం కష్టమనిపించింది. కరువులో అధికమాసమన్నట్టూ, అత్తగారు "కలిగినవాళ్ళ సంబంధం, అందం, ఉండి ఏం లాభం? నా కొడుకు పొట్ట చేతబట్టుకుని కాలినడకని అంతదూరం వెళ్ళి పనిచేసుకోవలసి వచ్చింది. దిక్కుమాలిన సంబంధం." అంటూ విసుక్కునేది. ఒక్క భూషణం మాత్రం దేవుళ్ళాగా చూసేవాడు, గంగని.

ఇలా ఒకసారి తహశీలు కట్టడానికి బస్తీ వెళ్ళేటపుడు ఇంత కారం బుట్టలో పోయించుకుని చేతపట్టుకుని బయలుదేరారు–వెళ్ళేటప్పుడు గంగకిచ్చి వెళదామని సోమరాజుగారు. అంతే. పెద్దకొడుకు అమాంతంగా వచ్చి చేతిలోంచి ఆ బుట్టని

బలాత్కారంగా లాగాడు. ఆయన చేతుల్లోనించీ, అంత దగ్గిరసా వచ్చి, వస్తువులు తీసుకోడం అదే మొదటిసారి. ఆయనకి కళ్లు తిరిగిపోయాయట. ఆ బుట్టలో కారం చెల్లా చెదురై, వాకిలంతా, అందరి కళ్ళల్లోనూ పడ్డది. పెద్ద రచ్చ జరిగింది. ఆయన వట్టిచేతులతో కాళ్లీడ్చుకుంటూ బయలుదేరాడు. అపుడాయన వెళుతూంటే ముఖం గుమ్మంలోంచి చూశానమ్మా. చెంపలవెంట కన్నీళ్లు కారుతున్నాయి. ఏమేమి ఆలోచనలు తలలో తిరుగుతున్నాయోనమ్మా! మేము పలుకరిస్తేకూడా బదులైనా చెప్పలేదు. అసలు వినిపించుకోనే లేదు. అల్లాగే ఎదురుగుండా చూసుకుంటూ నడిచి వెళ్ళిపోయారు, బస్తీ. పెద్ద పాలేరు మాత్రం ఆయనవెంటపోయాడు, దిగులుగా.

ఆ రాత్రి, ఇంట్లో అమ్మాయికి కాపలా ఉండమని ముందరే పాలేరుని పంపిం చేశారు. తనుపని చూసుకుని, నడిచివస్తూంటే, వెనక ఎవ్వరో నడిచినట్టనిపించిందట. వెనక్కితిరిగి చూస్తే ఎవ్వరూ ఉండేవారు గారట. కాస్సేపటికి ఊబిలో నడిచినట్టా, కాళ్లు బరువుగా అనిపించినాయట. ఒక్కొక్క కాలే ఎత్తి అడుగువెయ్యవలసి వచ్చేదట. తిన్నగా వచ్చి గంగతోనూ, భూషణంతోనూ చెప్పి, గంగని చూసి ఏవేవో అర్థం లేకుండా గొణిగి, ఇంటికి వెళ్లి పడుకున్నారు, అంతే.

మరునాడు లేచి, కాస్త తబ్బిబ్బు మాటలాడారుట. మతి స్థిరం లేకుండా పోయింది. వాళ్ళ అక్కగారు నిమ్మకాయలతో స్నానం చేయించారు. పిచ్చి తగ్గలేదు. అప్పుడప్పుడు కాస్త బాగా మాట్లాడేవారు. వెంటనే మతి పోయేది. అప్పుడప్పుడు వచ్చి కూతురిని ఆలనా, పాలనా అడిగేవారు. కావలసిన వస్తువులు తనంతట తానే ఎల్లాగో, రహస్యంగా తెచ్చి ఇస్తూండేవారు. చుట్టుపట్ల పల్లెటూళ్ళన్నీ కాలినడకని తిరిగి వస్తూండేవారు. ఊరువాళ్ళందరూ జాలిపడేవారు, గంగకి ఏడుపుకి మేరలేదు.

ఇల్లా తిరగడంలో ఆయన ఒక్కొక్కసారి, పరాయివాళ్ళ గడ్డివాములూ, అవీ తగులబెడుతూ వచ్చేవారు. ఆ నష్టపడిన బీదవాళ్ళు, ఎప్పుడైనా పరిహారం ఇమ్మంటే, కొడుకులు త్రాచుపాముల్లా బుస్సలు కొట్టేవాళ్లు., మీ తాతగారే సర్ది, కొంత ఇప్పించీ, అప్పుడప్పుడూ ఇప్పించకుండానూ సమాధానపరిచేవారు. మళ్లీ, ఒక్కొక్కప్పుడు చేతుల్లో ఏది ఉంటే అది దానధర్మాలు చేస్తూండేవారు. ఈ మతిలేని చేష్టల ఉధృతం అమావాస్యకీ, పౌర్ణమికీ మరీ ఎక్కువయ్యేది. కొడుకులు తండ్రిని అప్పుడే తిట్టడమూ, అప్పుడప్పుడు కొట్టబోవడమూ, వదినలు భోజనం పెట్టక పోవడమూ జరుగుతూండేది.

పాపం గంగ, "పిన్నిగారూ, పౌర్ణమీ, అమావాస్యా వస్తోందంటే భయంగా ఉంది. మా నాన్న ఏం కష్టాలు పడతారో? ఏ దేవుళ్ళకి మ్రొక్కుకోను?" అంటూ, వచ్చి నావద్ద ఏడ్చేదమ్మా.

ఇలా ఒకనాడు సందెవేళ, కొడుకులందరూ బస్తీకి వెళ్ళారు, పెళ్ళికి. సోమరాజు గారు వచ్చి, మీ తాతగారివద్ద దాచిపెట్టిన తాళాలగుత్తి అడిగిపుచ్చుకొని వెళ్ళారు. తరువాత, ఓ జాముపేళ మనస్సు నెమ్మదిలేక, ఏమైపోయాడో, తాళాలు ఎవ్వరికిచ్చాడో అని వాళ్లింటికి వెళ్ళారు తాతగారు. వెళ్లితే కంటబడ్డ దేమిటీ అంటే, ఆయన గాది ఖాళీచేసి దిగుతున్నారట. చుట్టూ ఉన్న పల్లెటూరువాళ్లు గంపలతో ధాన్యం మోసుకెళ్లుతున్నారుట. వాళ్లు, "మేం నిన్న గంజి త్రాగుతుంటే, చూసి, ఖామందులు అడిగారు, 'పంటలు పోయినయి, బియ్యపు గింజలు లేవు' అని చెప్పుకున్నాం బాబూ! నేను ధాన్యం ఇస్తా రమ్మన్నారు బాబు! వచ్చాం," అన్నారుట, నిజంగానే గాది ఖాళీ. కొడుకులూ, కోడళ్ళూ బళ్ళమీద పెళ్లినించీ వస్తున్నారట–వస్తూనే ఈ విషయం కళ్లారా చూశారు. ఒళ్ళూ మీదూ తెలియని కోపం వచ్చిందట. వాళ్ళకి. మరి రాదటలే! మీ తాతగారు గనుక దగ్గర లేకపోతే, ఇంకా ఏమయిఉండేదో ఊహించలేము గాని, ఏదో ఆయన భయాన్న అంతవరకూ ఆగింది.

"రేపు ప్రొద్దున్న బస్తీ వెళ్లి పోలీసువాళ్ళని తీసుకొచ్చి, ఒప్పచెప్పేస్తాం," అనీ, "సర్కారుకు వ్రాసేస్తాం," అని ఉరుముతూ చుట్టూ చేరారట. "ఈ మనిషి ఊరువాళ్ళకి చేసే నష్టాలకి పరిహారాలు ఇవ్వడమూ, పైగా ఈయన మా పిల్లల నోళ్ళల్లో దుమ్ముకొట్టి, ఉన్న ధాన్యం దానా ధర్మాలు! పోలీసుని పిలవండి. ఈపీడ విరగడయితే చాలు," అని కోడళ్ళూ ముఖంమీదికొచ్చి అన్నారు. మీతాతగారు ఎల్లాగో సమాధానపరచి, చెయ్యిపట్టుకుని, నిమ్మళంగా ఆయన్ని నడిపించుకుంటూ, తన భవంతిలోకే తీసుకెళ్ళారుట. నిమ్మళంగా ఆయన గదిలోకి వెళ్ళాక పెద్ద వయస్సేమో, ఉయ్యాలలో కూచోబడి పోయారట. కూడాఉన్న కొడుకులు తిట్టుకుంటూ, సణుగుకుంటూ "ఈయన్ని రాత్రిఅంతా స్వేచ్ఛగా వదిలితే, ప్రొద్దున్న లోపుగా, ఇంకా ఎన్ని అఘాయిత్యాలు చేస్తాడో!" అని పళ్లు పటపట కొరుకుతూ, ఇంట్లో ఉన్న పగ్గాలూ, పెళ్లి బండ్లపగ్గాలూ తెచ్చి, ఉయ్యాల నాలుగు గొలుసుల చుట్టూ గుండ్రంగా వలలాగు అల్లేసారమ్మా–ఆయన ఉయ్యాలలోంచి బయటికి రాకుండా.

అప్పుడాయన చూశారటగదా మీ తాతగారి వేపు, ఒక చూపు! మీ తాతగారికి కడుపు కలచినట్టయిపోయిందట. ఇహ చూడలేక పోయారట మీ తాతగారు. తరువాత నాతో అన్నారు. ఇంట్లో "సృష్టిలో శైశవ జీవకోటి అంతా, అసహాయంగా వున్నప్పుడు అల్లాగే చూస్తుందనుకుంటాను,'' అని కళ్ళు తుడుచుకున్నారు. ఏం చెయ్యాలో మాకు పాలుపోలేదు. ఇహను, ఎదురుగుండా, ఈచిన్న ఇంట్లో గంగ తల్లడిల్లిపోతూంది. ఏమైనాసరే, చొరవ చేసుకుని పుట్టింటికి వెళ్ళి, తండ్రిమీద పడి ఏడ్చి, తండ్రిని తెచ్చేసుకుందామా అనుకుందిట. కాని నొప్పులు ఆరంభం అయినాయి. నా లెక్క ప్రకారం నెలలు నిండేలేదు, సరిగ్గా. అయినాగాని, ప్రసవ వేదన ఆరంభం అయింది. తండ్రి చెయ్యి ఎంత జబ్బులోనైనా వదిలేది గాదయ్యె. అందుకని "నాన్న, నాన్న." అంటూ పక్షి అరిచినట్టు అరిచేది. ఆరాత్రి ఎల్లా గడిచిందోనమ్మా–ఈనాటికీ భయంకరమే. ఆ రాక్షస రాత్రి. మా ఇద్దరి మనస్సులూ మాలో లేవు. గంగ దుఃఖం వినలేము, చూడలేము. నరకయాతనతోనైనా, స్వర్గ సుఖాలతోనైనా కాలం గడుస్తూవుంటుంది గదమ్మా. నిలవదుగా! ఘడియలు జాములై నాయి. పున్నమిరాత్రి గడిచిపోతూంది.

తెల్లవారుజాముకి, గంగ ప్రసవించింది–మృత శిశువు.

అంతే, ఆక్షణంలో, అకస్మాత్తుగా పెద్ద గోల వినిపించింది. గంగ గదిలో అమ్మలక్కలందరూ వీథిలోకి పరిగెట్టారు–ఒక్కసారిగా. ప్రక్కగదిలో దిగులుగా కూచున్న భూషణం. దిగ్గున లేచి వచ్చాడు వీథిలోకి. గంగ అన్నలు ఒకటే పరుగు మీద పరిగెడు తున్నారు. భూషణానికి ఈ గందరగోళం ఏమిటో ఏమీ తెలియలేదు. తన మామగారు ఎల్లా వున్నారో అని భయం వేసింది. మొదట ఆయనని రక్షించాలి. అతని కింకేమీ తోచలేదు. వెంటనే ధైర్యం చేసుకుని, ఒక్క పరుగున, మామగారి యింట్లోకి వెళ్ళాడు. గదిలో మామగారు లేరు, ఉయ్యాల త్రాళ్ళు తెంపేసి వున్నాయి. ఉసూరు మంటూ విషయమంతా విని, బయటకొచ్చేశాడు.

ఈ లోపుగా అమ్మలక్క అందరూ, గంగవద్దకు వచ్చి, "మీ నాన్న పారి పోతున్నాడుట. మళ్ళా వెళ్ళి, ఏం కొంపదీస్తారో అని, మీ అన్నలు, తీసుకొచ్చి సర్కారులో ఒప్పచెబుదామని, కూడా పరిగెడుతున్నారట–పట్టి తీసుకురావడానికి, పాపం! అంత బ్రతుకు బ్రతికిన మహరాజుకి, ఎటువంటి గతి పట్టిందో చూడండి! ఏకాలానికి ఏమోగదా!" అని దీనంగా గంగచుట్టూ చేరి అన్నారు. గంగ మాట్లాడ

లేదు. ముఖంలో, మనం, చూడలేని బాధా, దుఃఖమూ అలుముకుపోయినాయి. నోరుతెరిచి ఏదో అనబోయింది. నోట మాట రాలేదు. అలా, చెంపలవెంట కన్నీళ్ళు ధారగా జారుతున్నాయి.

కొంచంసేపట్లో, కోపంతోనూ, దుఃఖంతోనూ ముఖం ఎర్రబారి, భూషణం, అంగలు వేసుకుంటూ లోపలి కొచ్చాడు. వస్తూనే. "చూశారా ఏం జరిగిందో! ఏం, గాభరా జరిగిందోనని, వాళ్లింటికి పరిగెట్టి, ఆయన గదిలోకి చక్కా వెళ్లాం. ఆయన ఏమైపోతున్నారో, పీళ్ళు కొడుతున్నారో, తిడుతున్నారో అని నాకూ గాభరాలో ఏమీ తోచలేదు. పీళ్ళ వదినలు చెబితే, ఇహను చేసే దేముందని, నేనూ వెళ్ళి వెతుకుదామని, బయటకొస్తున్నాను. పీళ్ళ పెద్దన్న ఆయన్ని తరిమి తిరిగి వస్తున్నారు. గుమ్మంలో నన్ను చూశాడు. అంతే, "ఎవడ్రా నువ్వు? ఎందుకొచ్చావు? మాకొంపకి నువ్వే శని. ఎవ్వరి నడిగి లోపలి కొచ్చావు? నడువు. ముందు, బయటికి. గుమ్మం తొక్క నక్కర్లేదు, నువ్వు." అని ఏకధాటిగా అన్నాడండీ!'' అని చెప్పి, భార్యతో గుమ్మంలోంచి మళ్ళా చెప్పాడు. ఆవిడ బదులు చెప్పలేదు. అల్లాగా ఏడుస్తూ వుండిపోయింది. అంతే, మేము తిరగి వక్కాణిస్తే కూడా, చేతితో సైగ చేసింది. గొంతు చూపించుకుంటూ, మాట రావడంలేదని. ఆపురిట్లో ఏమైందో మేమెరుగము. ఆరోజుల్లో ఈ వసతు లేవీ? ఈ డాక్టర్లు ఏరీ? పల్లెటూరు పురుడాయె. పైగా ధర్మాస్పత్రికైనా వెళదామనేంత శ్రద్ధ ఎలా వస్తుంది? అందరి మనస్సులూ సోమరాజుగారిమీదనే ఉండె! ఇంతకూ చికిత్సకు గంగ ఒప్పుకోవద్దూ? తిండి తీర్థాలకే శ్రద్ధ లేదాయె.

ఒక్క గంటసేపట్లో, వాళ్ళన్నలు గంగ ఇంటిమీదికి వచ్చారు. వాళ్ళు సోమరాజు గారి గదిలోకి వెళ్లేటప్పటికి, ఇనప పెట్టె తెరిచి వుందట. ఉయ్యాల ప్రక్కన. అందుకని, "మతిలేక ఆ ముసలాడు క్రిందపడేసిన తాళాలు తీసి, పెట్టె తెరిచి ఉంటావు. లేదా, ఆ తాళాలే నీదగ్గరే దాచాడో ఇన్నాళ్ళూ. అవ్వి కాస్తా పట్టుకుని, మేము అల్లా పరిగెట్టేసరికి, ఇంట్లో దొరబడి ఇనపపెట్టె తెరిచేశావు. సమయం చక్కగా చూసుకుని. ఆ నగలపెట్టె కాజేసావు-ఇనపపెట్టెలో నించి, తక్షణమే ఇచ్చెయ్యి. లేకపోతే పోలీసుకి చెబుతాం. ఆ నగలు మా పిన్నివి. అందులో సగం మా అమ్మవి కూడాను. నీకు ఏమాత్రమూ హక్కులేదు. బయటపడెయ్యి." అని బెదిరించారు. అప్పుడే మీ తాతగారు ఎంతో కష్టంమీద సమాధానపర్చగలిగారు.

"అబ్బాయిలూ, మీరంతా తెల్లవారకముందే, ఆయన్ని పొలాలవెంట తరుముకు పోతూంటే, ఎవ్వరూ ఇంట్లో లేరుగదా అనీ, ఉన్నా, ఎవ్వరి గాభరాలో వాళ్ళే వున్నారుగదా అనీ, తెలుసుకుని, దొంగలెవ్వరైనా ప్రవేశించి, అక్కడే ఆయన మతిలేక పడవేసిన తాళాలు పెట్టి, పెట్టె తెరచి, నగలు అపహరించి వుండవచ్చుగా. ఊరు నిండా దొంగలు తిరుగుతున్న విషయం అందరికీ తెలిసిందేగదా! ఇల్లా, గందర గోళంగా ఆపదలో వున్న ఇళ్ళు వాళ్ళకి వడ్డించిన విస్తర్లేనాయె. వీళ్ళ నెందుకు చంపుతారు? పైగా, వాడి ఇంట్లోగాని, వంటిమీదగాని ఆ సొత్తు దొరకలేదాయె. వీడు తీసినట్టూ సాక్షం ఏది?" అని, ఎంతో కష్టంమీద సమాధానపరిచారమ్మా. అయినా వాళ్ళు మాత్రం సమయంకోసం వేచుకుని వున్నారు. "ఎక్కడో ఆ నగలు దాచాడు. ఏ నాటికైనా అవ్వి బయటపడకపోతాయా?" అని పిడికిళ్ళు చూపించారు.

ఇహనదమ్మా మొదలు - గంగ మూగితనానికీ, చెప్పలేని నరకానికిన్నీ.

అల్లా పారిపోయిన సోమరాజుగారు, తిరిగి రాలేదు.

తరువాత కొన్నాళ్ళు, సోమరాజుగారు, ఎక్కడెక్కడో పల్లెటూళ్ళ పొలిమేరలలో, పొలాలలో, బస్తీ వీధులలోనూ, తిరుగుతున్నట్టూ వదంతులు పుట్టినయి. రంగుల వ్యాపారస్థులు చూసినట్టు ఆడవాళ్ళు చెప్పారు. ఒంటిరాయి, బంగారు పోగులూ, మాసి చినిగి పోయిన గుడ్డలూ, చంకలో చినిగిపోయిన గుడ్డలమూటా పట్టుకుని తిరుగుతున్నారట. ఒడ్డూ పొడుగూ ఖచ్చితంగా ఆనవాళ్లు చెప్పారు. ఇంకేంచెప్పనూ, గంగ ఏడుపుకి అంతులేదు. మరీ పౌర్ణమీ, అమావాస్యా వస్తూంటే, అక్కడ ఆయన ఏమైపోతున్నాడో అని కుమిలి కుమిలి ఏడ్చేది. చూడలేకపోయేవాళ్ళమమ్మా.

మరుసటి ఏడాది, అమ్మాయిని అత్తవారింట్లో దిగబెట్టి రావడానికి, జనార్దన తాతగారు బయలుదేరారు. అల్లుడు ఫారెస్టు పనిగదా. చింతలపూడి అడివి ప్రక్కకి బదిలీ చేశారు. తాతగారు, అక్కడికి వెళ్ళి చేరిన మధ్యాహ్నం, అల్లుడుగారి ప్రక్క ఇంటాయన అన్నారుట. "అయ్యా. మీ ఏరుపాలెం పెద్దమనిషి ఒకాయన, పాపం, మతి చెడ్డది. మహా బ్రతికినవాడెల్లే ఉంది. ఒక్కొక్కప్పుడు సవ్యంగానే మాట్లాడతాడు. ఎప్పుడు మతి చెదిరిపోతుందో తెలియదు. ఇప్పటికి ఆరేడు నెలలనించీ, ఈ ప్రాంతంలోనే ఉంటున్నాడు. అడివిలోపల ఉంటున్నట్టు చెబుతాడు. ప్రతిరాత్రీ ఊళ్ళోకి వస్తాడు. అదేమిటో, మా ఇంటికే వస్తుంటాడు. పేరు సోమరాజు అని చెప్పాడు. పాపం వాళ్ళవాళ్ళకి చెప్పండి. మా ఇంట్లోనే భోజనం చేస్తాడు. ఈ

సాయంత్రం, మీరు వచ్చారని చెబుతాను.'' అన్నాడట. మీ తాతగారికి, సంతోషమూ, దుఃఖమూ, పొంగుకు వచ్చినాయట. "వస్తే వెంటనే నన్ను పిలవండి,'' అన్నారట, మీ తాతగారు. ఆవేళ భోజనాల వేళకి మళ్లీ ఆ ప్రక్కింటాయన వచ్చి, "మిమ్మల్ని పిలవడానికి మదురు ప్రక్కకి వచ్చానండి. సోమరాజుగారు భోజనం చేస్తున్నారు, అరుగుమీద. నా కేక మీకు వినబడలేదు. వీధి వైపు వద్దామని మళ్లా అరుగువైపు వచ్చాను. అంతే ఆయన విస్తరి వదిలేసి వెళ్ళిపోయారు. పాపం! అప్పటి కప్పుడే మతి చెదిరినట్టుగా ఉంది. అక్కడికీ చెప్పాను. 'మీ ఊరునించీ ఒకాయన వచ్చారు. ఈ ప్రక్కయింట్లో ఉన్నారు. పిల్చుకొస్తా, ఉండమన్నాను కూడాను,'' అన్నాడట. ఆ మరునాడూ రాలేదు భోజనానికి, ఒక వారం చూశారు రాలేదు. ఇంతట్లో మీ తాతగారికి ఆ విషజ్వరం రావడమూ అదీ అయ్యిందా, ఆయన మళ్ళా లేచేటప్పటికి ఒక నెల పట్టింది, పడకనించీ. వెంటనే తాతగారూ, అల్లుడూ, ప్రక్కంటి ఆయనా కలసి అడవిలోపలికి ఆయనని వెతుక్కుంటూ పోయారట. అక్కడ మేకలని మేపే వాళ్ళూ, పుల్లలు కొట్టేవాళ్ళూ, ఆయన సాధారణంగా ఉండే గుట్టలోకి దారి చూపిస్తూ, వెంట వెళ్ళారుట. కొంత దూరాన్న ఉండగానే, "ఇహ మేం రాం, బాబోయ్! అదిగో పెద్దపులి,'' ఆయన ఉండే గుట్టలోనే పడుక్కుంది. ఇదే ఈ మధ్య పారిపోయి ఇటు వచ్చింది. మనుష్యుల్ని తింటోందనీ, భద్రంగా ఉండమనీ అన్నారు, అందరూ. ఇహ మేము రాం. అయన్నీ ఇదే తిన్నదేమో బాబోయ్,'' అని గాభరాగా నిలబడిపోయారట, దారి చూపించేవాళ్లు. ఇంతలో అడివిలో తేనెకి వెళ్లేవాడు ఒకడు, "ఈ పులి ఒక నెలనించీ ఒక్కడే ఉందండి. ఇంతకుముందు ఆ గుహలో ఒక పెద్దాయన పండుకుంటూండేవారు, పగలూ రాత్రీకూడా. ఇదే ఆయన్ని తినేసి, అక్కడే పడిఉందండీ–మళ్లీ ఎవ్వరైనా వస్తారేమోనని. మేమంతా ముందరే అనుక్కున్నాం–ఇది ఏనాడు ఇక్కడికి వచ్చిందో, ఆనాడే ఆయన్ని కాజేసింది,'' అని అన్నాడట. "ఈ ప్రాంతంలో ఇంకా మా ఆఫీసు బందోబస్తుగా లేదండి. లేకపోతే ఈ పులి ఇక్కడికి వచ్చేదేకాదు. వచ్చి ఇన్నాళ్లు ఇట్లా తప్పించుకుపోయేదే గాదు,'' అని అల్లు డన్నాడట. నిదానించి చూస్తే, దాని ముందు, ఎముకలూ, అవీ ఉన్నాయట. తాతగారికి మతిపోయి నట్టయిందట. ఇహ, తిరిగి రాబోతు న్నారట. ఆయన కాళ్లదగ్గర త్రుప్పుపట్టిన తాళాల గుత్తి నేలమీద ఇసకలో కనిపించిందట. ఆ తాళాలు మట్టుకు పటుకొచ్చారు, ఇంటికి.

ఈ సంగతి ఊళ్లో తెలియగానే, కొడుకులు, ఏదో మొదట కాస్త జాలిపడ్డారేమో గాని, వెంటనే భూషణంమీదికి లేచారు. "ఆమతిలేని ముసలాడు, ఆరాత్రే పెట్టె తెరిచివుంటాడు. ప్రొద్దున్న వీడికి, అమాంతంగా, చేత, నగలపెట్టె చిక్కించుకోడం మహా సులువై పోయింది," అని ఒకడూ, "మమ్మల్ని పెళ్ళి కెళ్ళనిచ్చి జనార్దనయ్య గారి దగ్గరనించి తాళాలు తెచ్చి, ఇనప పెట్టె తెరిచి, నగలపెట్టె వీడికీ, గాదెలో ధాన్యం ఊరువాళ్ళకీ పంచిఇచ్చాడయ్యా. అది కాస్తా దాచేసి ఏమీ ఎరగనట్టు, తెల్లవారి పరామర్శకు వచ్చాడు, మా ఇంటికి వీడు." అని ఒకడూ తిట్టాడు.

ఈ సంగతి తెలిసాక, ఆరు మాసాలవరకూ మనలో లేదు గంగ - వాళ్ళ నాన్న పోయారన్నమాట విని.

తరువాత నిమ్మళంగా, భూషణం మనుష్యులలోకి వచ్చాడు. వాళ్ళ కుటుంబం అల్లాగే బీదగా నడుస్తూంది. భూషణం, బస్తీలో దొరికినపుడల్లా ఏపనిపడితే ఆపని చేసి, భత్యాలు ఇంటికితెచ్చి ఇల్లు గడుపుతున్నాడు. జరుగుబాటు, మహా కష్టంగానే వుండేది.

గంగ మనస్సులో ఏమేమి ఆలోచనలు తిరుగుతూండేవో, హృదయంలో ఎంత ఆవేదన పొంగుతూండేదో, మనకేం తెలుసు, చెప్పడానికి నోరులేదుగా. నోరు మూగాయె. ఏవేళా ఏడుస్తూ, తన గుమ్మంలోనించీ, అడ్డత్రోవకేసి, నడిదిబ్బకేసి తదేకదృష్టితో, అల్లా గంటలతరబడి, చూస్తూ వుండిపోయేది. గంగమ్మతల్లి, నీడ లేకుండా, నడిదిబ్బమీద, నిలుచునే వుండేది.

రెండేళ్ళకి, భగవత్కృపవల్ల గంగ తిరిగి గర్భవతిఅయింది! "పొన్నపండులాంటి కొడుకు పుడతాడమ్మా. మీ నాన్నగారి పేరే పెట్టు,'' అని ఓదార్చేవాళ్ళం.

నెలలు నిండినయి. గంగపైన అన్నల ద్వేషాలు ఏమీ తగ్గలేదు. "ఎప్పటికైనా, వీడు ఎత్తుకెళ్ళిన నగలు కరిగించుకుని, పొలాలూ, తోటలూ కొనకపోతాడా? ఎన్నాళ్ళు ఎవ్వరివద్ద దాచిపెట్టి వుంచుతాడో చూస్తాం." అని మీసాలు మెలేస్తుండేవారు.

ఆనాడు శుక్లచతుర్దశి. ఆ రోజంతా మూగబాధ అనుభవించింది, గంగ. ఆ రాత్రికూడా గడిచింది. తిరిగి తెల్లవారుజాము గడియలు వచ్చినయి. గంగ సుఖప్రసవమైంది - మగ శిశువు. మేమంతా అనుకున్నట్టే, సాక్షాత్ సోమరాజుగారే.

పిల్లాడు పుట్టాడు. అంతే, "మా నాన్న" అంది, గంగ. గట్టిగా గాభరాగా. మేమంతా నివ్వెరపోయాం. మూడు సంవత్సరాల మూగనోరు పలికింది. "పిల్లాడు పుట్టిన అదృష్టమేమో,'' అన్నారు. అమ్మలక్కలందరూ. అవతల గదిలోకి వంగి, "మాట వచ్చిందయ్యా'' అని అరిచారు, అందరూ ఆనందాశ్చర్యాలతో.

"మా నాన్న" అంది గంగ, ఇంకా గాభరాగా.

"మీ నాన్నే, కొడుకుని కళ్ళారా చూడనైనా చూడలేదు ఇంకాను. అప్పుడే ఎంత ఆశ!" అని సరసమాడింది, మంత్రసాని. గంగ వెర్రిగా కళ్ళతోనే వెతుకుతూ "మా నాన్న" అంటూనే వుంది.

ప్రక్కగదిలోనించీ భూషణం వంగిచూసి, "ఏమిటే?" అన్నాడు, ప్రేమతోనూ, కృతజ్ఞతతోనూ.

"మా నాన్న వచ్చాడండీ," అంది. తల అటూఇటూ మంచం మీదనే కొడుతూ, దీనంగా భర్తకేసిచూసింది. "పిన్నిగారూ, బయట చూడండి, మా నాన్న దగ్గు వినిపించింది. మా నాన్న వచ్చాడు," అంది నాకేసి చూస్తూ. "ఇదేదో గాలిచేష్ట. మూడేళ్ళు నోరులేకుండా చేసింది. ఇప్పు డిలాంటిమాట లాడిస్తోంది. అయినపోయి రెండేళ్లు దాటిపోయె,'' అంది మంత్రసాని. తల పంకిస్తూ.

అయినా, హరికేనులాంతర్లు పుచ్చుకుని, భూషణమూ నేనూ బయలుదేరాం. అమ్మలక్క లందరూ పురిటింట్లో అవీ, ఇవీ చూస్తున్నారు. మేము ఇంటిచుట్టూ తిరిగాం. గంగ గది కిటికీ సుమారుకి వచ్చాం. అక్కడ నేలదిమ్మెసా తక్కువ. కాస్త చెమ్మ ఎప్పుడూ; ప్రక్కగుంట అక్కడికి దగ్గర. ఆ తడి నేలలో పెద్ద అడుగులు కనిపించాయి, లాంతరు వెలుగులో. అడుగులు ముందుకూ వెనక్కూ కూడా ఉన్నాయి. భూషణం గాభరా పడిపోయాడు. నాకూ ముచ్చెమటలు పోసినయి. "మామయ్యగారి అడుగులేనండీ ఇవి. ఆ సాయంత్రం మతిపోయినప్పుడు, అడుగులు దిగబడ్డవని చెబితే. లాంతరుతో వెతికాను. ఈదారినే వచ్చారు బస్తీనించీ. ఆరోజూ అడుగులు ఇవ్వే-ఇల్లాగే వున్నాయి....'' అన్నాడు. నాకూ అంతే ననిపించింది.

లాంతరు ఎత్తి, ఎగిరి, కిటికీగుండా, ఇంట్లోకి ఈ సంగతి చెప్పబోయాడు భూషణం. కిటికీలో ఒక చింకిగుడ్డల మూట పెట్టి వుంది. ఒక్క పరుగున లోపలి కెళ్ళాం. ఆమూట భయంగా, కర్రతో క్రిందికి త్రోశాం. 'టక్' అని ఒక పెద్ద

శబ్దంతో పడ్డది. ధైర్యం చేసుకుని, భూషణం మూట విప్పాడు లోపల నుంచి గంధపు చందువా వుంది. ఇక నేనూ ధైర్యం చేసుకుని, ఆ చందువా తెరిచాను. గంగకి పెళ్ళికి పెట్టిన నగలన్నీ, అందులో, చిన్నం ఎత్తు పోకుండా వున్నాయి. ఆ నగలమీద కాయితం ఒకటి చుట్టి వుంది. పురికోస తాడుతోకట్టి, గంగ పేరులో వ్రాసిన ఉయలునామా, అది. ఆ పెట్టె, ఆ సమగ్రీ నాకు పరిచయమే.

వెంటనే పరిగెట్టాం బయటికి, భూషణమూ, నేనూ, మా వెనక అందరూ.

మా కళ్ళముందు నిమ్మళంగా కాళ్ళీడ్చుకుంటూ, ఎత్తుగా నడిచిపోతున్నారు, సోమరాజుగారు. పొలిమేరలోకి, మేం పరిగెత్తాం. ఆయన పరిగెత్తారు. మమ్మల్ని తన కొడుకులే అనుకుని భయపడ్డారో యేమో! మేం పిలిచాం. ఆయన వినిపించు కోలేదు. ఒక్క క్షణంలో మా అలికిడికి, ఆయన వెనక్కి తిరిగిచూశారు. మేము ఆనవాలే రాలేదు. ఒక్క పరుగున, నడిదిబ్బకేసి మరీ విసురుగా పరిగెత్తారు. ఎంచేతనో ఈనాటికీ, మాకు నిశ్చయంగా తెలియదమ్మా, నడి దిబ్బమీదనే గంగమ్మతల్లి వుంది.

వృద్ధాప్యంవల్లనో, జీవితాశయం ఈడేరిందనో, లేక, పరిగెత్త లేక ఏమైనాసరే అమ్మవారి పాదాలవద్ద వాలిపోదామనో, ఆ చింత చెట్టు చీకటి కడ్డంగా అమ్మవారి వద్దకే పరుగెత్తారు. అమ్మవారి చుట్టూ బెట్టుగా పెట్టిన రాళ్ళమీదనించీ, తన బల మంతటితోనూ, అమ్మవారి మీదకి వాలిపోయారు.

ఆ పడడంలో, అమ్మవారి ముఖం ఆయన కణతకి తగిలిందల్లే వుంది. పెద్ద గాయంపడి, అమ్మవారిమీద కూడా కాస్త రక్తం అంటుకుంది.

మేము పట్టుకుని లేవనెత్తేటప్పటికి స్పృహలేదు. తీసుకొచ్చి భూషణంగారి వసారాలో భద్రంగా పడుకోబెట్టాం.

గంగ, "మా నాన్న, మా నాన్నని పిలవండీ!" అంటూ ఏడుస్తూంది, లోపల. "అమ్మా దెబ్బ తగిలింది. మతి ఇంకా రాలేదు," అని సముదాయించాం. "కొంచెం ఆగు, అమ్మా!" అని ఎంతో చెప్పాం.

ఆ పగలంతా చావు బ్రతుకుల మధ్య గడిచింది. ఊరు వాళ్ళంతా ఉసూరు మంటూ, వచ్చారు–ప్రక్క ఊళ్ళవాళ్ళూ వచ్చి చేరారు. "ఎంతటి మహారాజుకి ఏమి తిప్పలు!" అంటూ కూచోబడి పోయారు.

లోపల గంగ మూలుగుతూ ఏడుస్తూంది.

సూర్యాస్తమయమైంది. సోమరాజుగారికి స్పృహ రాలేదు, తిరిగి. మమకారాలూ, భయాలూ, ఉపాయాలూ, ఆలోచనలూ, వ్యథలూ, అన్నీ ఆరిపోయినయి. ఎక్కడి కెళ్ళినయ్యో! ఎల్లా అంతరించినయ్యో నమ్మా!

గంగ ఉండబట్టలేక నిమ్మళంగా, నీరసంగా, గోడలు పట్టుకుని నడిచి వచ్చింది, గదిలోనించి. గమ్మంలో నిలుచుని, పడుకుని వున్న తండ్రిని చూసింది.

సోమరాజుగారి చెయ్యి పట్టుకుని నాడి చూస్తున్న భూషణం, ఆ చెయ్యి చటుక్కున వదిలేసి, కండువా నోట్లో పెట్టుకుని బావురు మన్నాడు, అందరూ వెక్కి వెక్కి ఏడవసాగారు.

గంగ చూపులో ఏదీ సోకినట్టుగా లేదు. ఆ చూపులో వున్న ప్రపంచం, మనది కాదనిపించింది.

శిలా ప్రతిమలా, ఆకాశంకేసి చూసి, చేతులు జోడించి, దణ్ణం పెట్టింది, "భగవంతుడా!'' అంది.

ఎదురుగా, తూర్పున, పున్నమి చంద్రుడు పెద్దగా, ఎర్రగా ఉదయిస్తున్నాడు.

✤ ✤ ✤